# మనం

## మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల, నారాయణ పేట, వనపర్తి

శుక్రవారం । 24 । ఏప్రిల్ । 2026    పేజీలు: 10


## ఈటల రాజేందర్‌ను కలిసిన గిరిజన నాయకుడు తిరుపతి నాయక్



పాత తాండ గ్రామపంచాయతీ అభివృద్ధికి నిధులు కేటాయించాలని వినతి

2



# విద్యాభివృద్ధికి తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకం

- విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ప్రాముఖ్యత అవసరం

తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయుల పాత్ర కూడా అంతే కీలకం....

- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాల నిర్వహణలో సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లాలో సంక్షేమ వారోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో నాగర్ కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని బిజినపల్లి మండలంలోని పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశానికి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆకస్మికంగా హాజరయ్యారు.

2

## ఎన్టీఆర్ స్టేడియం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం

- అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

2



అచ్చంపేట పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియం అభివృద్ధి పనులపై స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ గురువారం మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీ ఈఈ, డీఈ, ఏఈ లతో కలిసి పనుల పురోగతిని క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. స్టేడియంలో జరుగుతున్న మౌలిక వసతుల మెరుగుదల, మైదానం స్థాయి పెంపు, క్రీడాకారులకు అవసరమైన సదుపాయాల కల్పనపై అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు.



# ఘనంగా భగీరథ మహర్షి జయంతి వేడుకలు

- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్....
- ఎమ్మెల్సీ కూచ్చుకుళ్ల దామోదర్ రెడ్డి....

నాగర్ కర్నూల్ కలెక్టరేట్లో నాగర్ కర్నూల్ జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం భగీరథ మహర్షి జయంతి సందర్భంగా శాసనమండలి సభ్యుడు కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి, నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మహర్షి భగీరథుని చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

2



# ఎన్టీఆర్ స్టేడియం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం

- అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

అచ్చంపేట ఏప్రిల్ 23(మనం న్యూస్): అచ్చంపేట పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియం అభివృద్ధి పనులపై స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ గురువారం మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీ ఈఈ, డీఈ, ఏఈ లతో కలిసి పనుల పురోగతిని క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. స్టేడియంలో జరుగుతున్న మౌలిక వసతుల మెరుగుదల, మైదానం స్థాయి పెంపు, క్రీడాకారులకు అవసరమైన సదుపాయాల కల్పనపై అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. ప్రేక్షకుల కోసం గ్యాలరీ వసతులు ఇతర సౌకర్యాల విస్తరణపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అచ్చంపేట యువతకు ఎన్టీఆర్ స్టేడియం ఒక ఉత్తమ క్రీడా వేదికగా నిలవాలని, పనుల్లో ఎటువంటి జాప్యం జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది మరియు సంబంధిత శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఈటల రాజేందర్ను కలిసిన గిరిజన నాయకుడు తిరుపతి నాయక్

**పాత తాండ గ్రామపంచాయతీ అభివృద్ధికి నిధులు కేటాయించాలని వినతి**



రేవల్లి , ఏప్రిల్ 23 (మనం న్యూస్): మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు, భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్ను బుధవారం హైదరాబాద్ షామీర్పేట్ నివాసంలో రేవల్లి మండలం, వనపర్తి జిల్లా గిరిజన నాయకుడు తిరుపతి నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పాత తాండ గ్రామపంచాయతీ అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని ఆయన ఎంపీని కోరారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజలకు అవసరమైన సదుపాయాల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఎంపీ నిధుల ద్వారా సాధ్యమైనంత మేర సహాయం అందించాలని తిరుపతి నాయక్ అభ్యర్థించారు. దీనిపై స్పందించిన ఈటల రాజేందర్, గ్రామ అభివృద్ధి అంశాలను పరిశీలించి సాధ్యమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది.

# విద్యాభివృద్ధికి తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకం

**- విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ప్రాముఖ్యత అవసరం**

**తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయుల పాత్ర కూడా అంతే కీలకం....**

**- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ....**





ఉమ్మడి మహబూబ్ నగర్ ఏప్రిల్ 23 (మనం బ్యూరో): ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాల నిర్వహణలో సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లాలో సంక్షేమ వారోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో నాగర్ కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని బిజినపల్లి మండలంలోని పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాన్నికి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆకస్మికంగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రగతి, పాఠశాల అభివృద్ధి, తల్లిదండ్రుల బాధ్యతలపై కలెక్టర్ అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ......, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంత ముఖ్యమో, తల్లిదండ్రుల పాత్ర కూడా అంతే కీలకమన్నారు. విద్యార్థులు పాఠశాలలో నేర్చుకునే విద్యతో పాటు ఇంటి వద్ద తల్లిదండ్రుల ప్రోత్సాహం, పర్యవేక్షణ ఎంతో అవసరమన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే కుటుంబం, పాఠశాల మధ్య సమన్వయం అవసరమని స్పష్టం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ పలు వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆధునిక డిజిటల్ విద్యా వనరుల ఏర్పాటు, ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాల నిర్వహణ ద్వారా విద్యా నాణ్యతను మెరుగుపరచడానికి కృషి జరుగుతోందని కలెక్టర్ వివరించారు. జిల్లాలో విద్యార్థుల హాజరు శాతం పెంపు, మధ్యలో చదువు మానేసే వారి సంఖ్య తగ్గింపు, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేందుకు అనేక చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. తల్లిదండ్రులు తమ పిల్లల విద్యపై మరింత శ్రద్ధ వహించాలన్నారు. వారిని క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలన్నారు. ఇంటి వద్ద చదువుకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం ద్వారా పిల్లల అభ్యాసంలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చనని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలను ఉపాధ్యాయులతో చర్చించి వెంటనే పరిష్కారం కనుగొనాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫార్ములు, మధ్యాహ్న భోజన పథకం వంటి సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. ఈ పథకాలు విద్యార్థుల చదువుకు ప్రోత్సాహకరంగా నిలుస్తున్నాయని తెలిపారు. పాఠశాలలో ఇటీవల గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు తమ అభిప్రాయాలను వెల్లడిస్తూ పాఠశాల అభివృద్ధికి అవసరమైన సూచనలు చేశారు. సంక్షేమ వారోత్సవాల ద్వారా ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువవుతూ, వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని త్వరితగతిన పరిష్కరించే దిశగా కృషి చేస్తోందని తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా భగీరథ మహర్షి జయంతి వేడుకలు

**- భగీరథ మహర్షి పట్టుదల సేవాభావం ప్రతి ఒక్కరికి ఆదర్శం కావాలి....**

**- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్....**

**- ఎమ్మెల్సీ కూచ్చుకుళ్ళ దామోదర్ రెడ్డి....**



ఉమ్మడి మహబూబ్ నగర్ ఏప్రిల్ 23 (మనం బ్యూరో): నాగర్ కర్నూల్ కలెక్టరేట్లో నాగర్ కర్నూల్ జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం భగీరథ మహర్షి జయంతి సందర్భంగా శాసనమండలి సభ్యుడు కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి, నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మహర్షి భగీరథుని చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ....., భగీరథ మహర్షి పట్టుదల, సేవాభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని కలెక్టర్ పేర్కొన్నారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసి గంగానదిని భూమికి తెచ్చిన మహనీయుడిగా భగీరథుని చరిత్రలో నిలిచిపోయారన్నారు. అందుకే గొప్ప ప్రయత్నాలను 'భగీరథ ప్రయత్నం'గా పిలుస్తారని కలెక్టర్ ఈ సందర్భంగా వివరించారు.

లక్ష్యం పట్ల అంకితభావం, పట్టుదల ఉంటే ఎంతటి కష్టమైన పనినైనా సాధించవచ్చని భగీరథుని జీవితం యువతకు గొప్ప సందేశమని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది భగీరథ జయంతిని అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. ఈ వేడుకల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని భగీరథుని ఆశయాలకు అనుగుణంగా సమాజంలో నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు.

ఎమ్మెల్సీ కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ....., భగీరథుడు భూమిపైకి గంగను తెచ్చిన మహనీయుడని కొనియాడారు. వారి త్యాగనిరతి, పట్టుదల ఆదర్శనీయమని ఎమ్మెల్సీ అన్నారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి, సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. భగీరథుని ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సగర కులస్తుల అభివృద్ధికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. సగర కుల సంఘాల ప్రతిపాదనలను ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. నాగర్ కర్నూల్ పట్టణంలో అందుకు అవసరమైన ఏర్పాట్లను చేస్తామని హామీ ఇచ్చారు. సగర కుల సంఘ నాయకులు వక్తలు మాట్లాడుతూ... భగీరథుని స్మరిస్తూ, విగ్రహాన్ని సగరకుల భవనాన్ని ఏర్పాటుకు, కృషి చేయాలని వారు ఈ సందర్భంగా కోరారు.



ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సహాయ అధికారి శ్రీరాములు, వివిధ శాఖల జిల్లా అధికారులు,

సగర సంఘం జిల్లా అధ్యక్షుడు గట్టు శ్రీనివాసులు సాగర్,18వ. వార్డు కౌన్సిలర్ చంద్రకళ సాగర్, సాగర సంఘం నాయకుడు అల్లం రాముడు, సీనియర్ జర్నలిస్టు సాయిలు సాగర్, లక్ష్మణ్ సాగర్ ,టౌన్ అధ్యక్షుడు బాలయ్య సాగర్ ,బంగారయ్య సాగర్ ,సూరంపల్లి సుధాకర్ సాగర్, సంఘం నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో లింగ నిర్ధారణ చట్టం అమలుపై కఠిన నిబంధనలు తప్పనిసరి పాటించాలి

**– నాగర్ కర్నూల్ కలెక్టర్ బాదావత్ సంతోష్....**

ఉమ్మడి మహబూబ్ నగర్ ఏప్రిల్ 23 (మనం బ్యూరో): లింగ నిర్ధారణ (పి సి పి ఎన్ డి టి) చట్టం నిబంధనల అమలులో ఎలాంటి రాజీ ఉండదని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ స్పష్టం చేశారు.

నాగర్ కర్నూల్ జిల్లాలో కొత్తగా ఏర్పాటవుతున్న క్లినిక్లు, ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లకు అనుమతులు పూర్తిగా చట్టబద్ధ నిబంధనల ప్రకారమే మంజూరు చేయనున్నట్లు గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి బహుళ సభ్యుల అనుకూల అధికారి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 15 ఆసుపత్రులు, 3 స్కానింగ్ సెంటర్ల అనుమతి దరఖాస్తుల అనుమతులపై చర్చించారు. సమావేశంలో ప్రతి దరఖాస్తును





విడివిడిగా పరిశీలిస్తూ, సంబంధిత కేంద్రాలు చట్టపరమైన ప్రమాణాలను పాటిస్తున్నాయా లేదా అనే అంశంపై కమిటీ సభ్యులు సమీక్ష నిర్వహించారు. మౌలిక సదుపాయాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, వైద్యుల అర్హతలు, అలాగే స్కానింగ్ యంత్రాల వినియోగానికి సంబంధించిన అనుమతులు వంటి అంశాలను కమిటీ సభ్యులు డి ఎం హెచ్ ఓ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ....., సమాజంలో బాలికలపై వివక్షను నివారించడమే ఈ చట్టం ప్రధాన లక్ష్యమన్నారు. నాగర్ కర్నూలు జిల్లాలో బాలికల నిష్పత్తి కొన్ని మండలాల్లో తక్కువగా ఉందని గుర్తు చేశారు. కనుక లింగ నిర్ధారణకు సంబంధించిన ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను సహించబోమన్నారు. అన్ని వైద్య కేంద్రాలు తప్పనిసరిగా ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని కలెక్టర్ సూచించారు. అనుమతుల మంజూరులో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. నిబంధనలు పూర్తి చేసిన దరఖాస్తుదారులకే అనుమతులు మంజూరు చేయబడతాయన్నారు. లోపాలు ఉన్న దరఖాస్తులను తిరస్కరించడం లేదా సవరణలకు పంపించడం జరుగుతుందన్నారు. వచ్చిన 15 ప్రైవేట్ క్లినిక్, మూడు స్కానింగ్ సెంటర్ల దరఖాస్తులను పరిశీలించి అనుమతులు ఇచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా స్థాయి కమిటీ సమావేశం ద్వారా వైద్య సేవల నాణ్యతను పెంపొందించడంతో పాటు, లింగ సమతుల్యతను కాపాడే దిశగా కఠిన చర్యలు కొనసాగుతాయని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, కమిటీ సభ్యులు తెలిపారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్ లాల్, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, నాగర్ కర్నూల్ డి ఏం హెచ్ ఓ రవికుమార్ నాయక్, ఇండియన్ మెడికల్ కౌన్సిల్ జిల్లా ప్రెసిడెంట్ డాక్టర్ యం. చెన్నయ్య, ఎన్జీవో లక్ష్మణరావు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ భరత్, శ్రీనివాసులుతో పాటు తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు లబ్ధిదారునికి అందించిన కాంగ్రెస్ నాయకులు

**ఎమ్మెల్యే జి .మధుసూదన్ రెడ్డి సూచన మేరకు..**

కొత్తకోట, ఏప్రిల్ 23 (మనం న్యూస్): మండల పరిధిలోని కనిమేట గ్రామంలో భీమా ప్రభాకర్ శెట్టి (జిల్లా వికలాంగుల పోరాట సమితి నాయకులు) గత కొన్ని నెలల కింద అనారోగ్యంతో హైదరాబాదులో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది ఉన్నారు. గ్రామ కాంగ్రెస్ నాయకులు విషయం ఎమ్మెల్యే జిఎంఆర్ దృష్టికి తీసుకెళ్లగా హాస్పిటల్ బిల్లు ప్రభుత్వానికి అందజేసి బాధితుడికి 42000 రూపాయల చెక్కును గ్రామ కాంగ్రెస్ నాయకుల ద్వారా అతడి నివాసానికి గురువారం తీసుకెళ్లి అందజేసే విధంగా సూచించారు. దీంతో గ్రామ కాంగ్రెస్ నాయకులు భీమా ప్రభాకర్ శెట్టి ఇంటికెళ్లి చెక్కును అందజేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేయడంతో ప్రభాకర్ శెట్టి మాట్లాడుతూ ప్రజా పాలనలో ప్రజా ప్రభుత్వానికి పేద ప్రజలకు సహాయం అందుతున్నందుకు..ఎంతో రుణపడి ఉంటామని.. ఎమ్మెల్యే జిఎంఆర్ గారికి ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరకుల యాదగిరి, పార్టీ ప్రధాన కార్యదర్శి మంద విశ్వేశ్వర్ (కన్నయ్య), ఇందిరమ్మ కమిటీ సభ్యులు నాగేశ్వర్ రెడ్డి, నాయకులు కృష్ణయ్య గౌడ్, ఆర్.ఎం.పి సుధాకర్ రెడ్డి, ఆకుల శ్రీనివాసులు, మధ్యల వెంకటయ్య పాల్గొన్నారు.

## భక్తుల సౌకర్యార్థం శ్రీశైలంలో ఉచిత వైద్య శిబిరం

**– చారకొండ డా,సిహెచ్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో**

చారకొండ,ఏప్రిల్23(మనం న్యూస్): శ్రీశైలం పుణ్యక్షేత్రంకు వచ్చు భక్తుల సౌకర్యార్థం శ్రీశైలం పద్మశాలి సత్రమునందు,నాగర్ కర్నూలు జిల్లా చారకొండ మండల కేంద్రానికి చెందిన డాక్టర్ చిలువేరు శ్రీనివాసులు వైద్య శిబిరం వారి తల్లిదండ్రులు చిలివేరుమల్లప్ప,మల్లమ్మల జ్ఞాపకార్థం గత17సంవత్సరాలుగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుంది.ఈ శిబిరమును సత్రం అధ్యక్షుడు కర్నాటి శ్రీధర్ ప్రారంభించారు.ఈ సత్రమునకు వచ్చే భక్తులకు ఉచిత వైద్యంతో పాటు,మందులను నిర్వాకులు అందజేయడం జరిగింది.ఈ వైద్య సేవలు ముందు ముందు సేవలు అందించాలని యాత్రికులు కోరారు.ఈ కార్యక్రమంలో సత్రం మేనేజర్ వేల్పుల కృష్ణ,అసిస్టెంట్ మేనేజర్ గోవిందరాజు,సత్రం సిబ్బంది పీవీ గిరి,నాగార్జున,యాత్రికులు పాల్గొన్నారు




## తల్లిదండ్రులు వేసవి సెలవుల్లో తమ పిల్లలపై దృష్టి పెట్టాలి

**– ఎంఈఓ ఝాన్సీరాణి**
**– విద్యార్థులు ప్రాణాపాయం ఈతకు వెళ్లొద్దు**



చారకొండ,ఏప్రిల్23(మనం న్యూస్): వేసవి సెలవుల్లో తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంఈఓ ఝాన్సీ రాణి తెలిపారు.గురువారం ఎంఈఓ పత్రికా ప్రకటనలో తెలుపుతూ విద్యార్థులకు వేసవి సెలవులు ఈ రోజు నుండి జూన్ 11 వరకు, తిరిగి జూన్ 12న ప్రారంభమైతాయని,కనుక విద్యార్థులు వేసవి సెలవులు సంతోషంగా సురక్షితంగా గడపాలని విద్యార్థులకు సూచించారు.తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రాణాపాయం ఈతకు వెళ్లకుండా,ఎండకు తిరగకుండా,సెల్ ఫోన్ వాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తండ్రి తల్లిదండ్రులకు తెలపడం జరిగింది.పిల్లలు తల్లిదండ్రులు,పెద్దలు లేకుండా కాలువలు,చెరువుల దగ్గరికి వెళ్లి సరదా కోసం నీటిలోకి వెళ్ళకూడదు,అత్యవసరం అయితేనే తప్ప పెద్దలను వెంబడి పెట్టుకొని వెళ్లాలని సూచించారు.ఎండలో విపరీతంగా ఉండడం ద్వారా మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 ఇంతవరకు బయటకు వెళ్లరాదని,పిల్లలు దాహం వేయకుండా అవసరం బట్టి మంచినీరు,మజ్జిగ కొబ్బరినీళ్లు లాంటి పానీయాలు తాగి వడదెబ్బ నుండి తెలిపారు.పిల్లలు వేసవి సెలవుల్లో ఫోన్ టీవీలు చూడకుండా మీ చెదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని విద్యార్థులకు తల్లిదండ్రులకు పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు.

## చారకొండ వివాహ వేడుకలో పలువురు నాయకులు



చారకొండ,ఏప్రిల్23(మనం న్యూస్): చారకొండ మండల కేంద్రం కె ఆర్ కె ఫంక్షన్ హాల్ లో గురువారం చంద్రాయన్ పల్లి గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ సొప్పరి పర్వతాలు కుమారుడి వివాహ వేడుకలో టాస్క్,సి,ఓ,ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించడం జరిగింది.అదేవిధంగా జెడ్పి మాజీ వైస్ చైర్మన్, పిసిబి మెంబర్ ఠాగూర్ బాలాజీ సింగ్,చారకొండ మండల వివిధ రాజకీయ పార్టీల నాయకులు,కార్యకర్తలు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో చంద్రాయన్ పల్లి సర్పంచ్ చిలికేశ్వరం శంకర్ ముదిరాజ్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాధగోని సాంబయ్య గౌడ్,జూపల్లి బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.




# సెలవుల్లో విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలి

**- ఎస్ఐ పి.వీరబాబు**

చారకొండ,ఏప్రిల్23(మనం న్యూస్): మండలంలోని పాఠశాలలకు వేసవి సెలవులు రావడంతో విద్యార్థులు తగు జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ పి.వీరబాబు గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...వేసవి సెలవులు రావడంతో తమ పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోని చెరువులు,కుంటలు,బావుల వద్దకు వెళ్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.పిల్లల పట్ల అశ్రద్ధ వహిస్తే చెరువులు,కుంటలు,కాలువలు,బావుల వద్దకు ఈతకు వెళ్లి అందులో పడి ప్రమాదానికి గురయ్యే అవకాశాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.ప్రమాద భరితంగా ఉన్న చెరువులు,కుంటలు,బావుల వద్ద కూడా ప్రత్యేక పోలీసు బృందం దృష్టి పెడతామని సమావేశంలో తెలిపారు.



# చారకొండలో భగీరథ మహర్షి జయంతి వేడుకలు

చారకొండ,ఏప్రిల్23(మనం న్యూస్): చారకొండ మండల కేంద్రంలో గురువారం సగర సంఘం ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.సగర సంగం నాయకులు మాట్లాడుతూ భగీరథ మహర్షి హిందూ పురాణంలో పట్టుదలకు దూడ సంకల్పానికి పాటుపడిన వ్యక్తిగా,తన పూర్వీకుల ఆత్మకు శాంతి చేకూరాలని గంగానదిని భూమి పైకి తీసుకువచ్చిన గొప్ప వ్యక్తిగావారిసేవలనుకొనియాడారు.కార్యక్రమంలో చారకొండ మండలం అధ్యక్షుడు వావిలాల రామస్వామి,ప్రధానకార్యదర్శిగంగపురంనాగరాజు,కార్యదరు ్శలు వావిలాల రమేష్,వావిలాల అనిల్,నార్లకంటి భాను ప్రసాద్,మహిళా కార్యవర్గ సభ్యులు వావిలాల నిర్మల సగర,మంజుల సగర,తేజ సగర లు పాల్గొన్నారు.

# రైతులకు లాభదాయక వ్యవసాయ అనుకూలంగా వంగడాలను కనుగొనాలి

**- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్...**

ఉమ్మడి మహబూబ్ నగర్ ఏప్రిల్ 23 (మనం బ్యూరో): గురువారం దక్షిణ తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘ సమావేశం పాలెంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ....., రైతులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ విస్తరణాధికారులు పరస్పరం సమన్వయం చేసుకుంటూ రైతుల సమస్యలకు సమయానుకూల పరిష్కారాలు కనుగొనాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఆధునిక సాంకేతికత వినియోగంతో వ్యవసాయంలో మానవ శ్రమను తగ్గించుకోవడంతో పాటు, ఆరోగ్యానికి హాని కలిగించని పద్ధతులను అవలంబించాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు అనుకూలమైన విధానాలను అనుసరించాలని కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని వాటిని తట్టుకునే పంటలు, సాంకేతికతలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వ్యవసాయంలో రైతులకు లాభదాయక పంటల వైపుకు తరలించే విధంగా శాస్త్రవేత్తలు వ్యవసాయ వంగడాలను రూపొందించాలని కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు.

రైతులు, శాస్త్రవేత్తలు అందించే సలహాలు సూచనలను పాటిస్తూ తమ పంట పొలాల దిగుబడిని పెంచే విధంగా శాస్త్రీయ బద్ధంగా పంటల సాగుకు అనువైన పరిస్థితులను కల్పించుకోవాలని కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు.

కార్యక్రమ ప్రారంభోపన్యాసం చేసిన ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం సంచాలకులు డా. ఎల్. కృష్ణ దక్షిణ తెలంగాణ ప్రాంతం వ్యవసాయ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నదని తెలిపారు. గత




సంవత్సరంలో వరి, వేరుశనగ, సెనగ వంటి పంటల్లో సాధించిన పురోగతిని వివరించారు. ముఖ్యంగా వరి పంటలో అభివృద్ధి చేసిన ఆర్ఎన్ఆర్ 25105, 31479 వంటి అధిక దిగుబడి, తక్కువ నూకశాతం కలిగిన వంగడాల గురించి వివరించారు. వేరుశనగలో నాణ్యమైన విత్తనాల ప్రాధాన్యతను కూడా వివరించారు.

విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు డా. బలరాం మాట్లాడుతూ......, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన వరి, ఆముదం పరిశోధన కేంద్రాలను అభినందించారు. చలి, ఎండలను తట్టుకునే పంట రకాల అభివృద్ధి, వరి ప్రత్యామ్నాయ పంటల విస్తరణ, వేరుశనగ, ఇతర పంటల విస్తీర్ణాన్ని పెంచడం వంటి అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరాన్ని వివరించారు. నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి, పంపిణీలో విశ్వవిద్యాలయం చేస్తున్న కృషిని కూడా వివరించారు.

అలాగే యూరియా సమగ్ర వినియోగం, చిరుధాన్యాల ప్రోత్సాహం, అడవి పందులు, కోతుల వంటి జంతువుల వల్ల కలిగే నష్టాన్ని నియంత్రించడానికి తీసుకుంటున్న చర్యలను శాస్త్రవేత్తలు వివరించారు. వ్యవసాయ విస్తరణ సంచాలకులు మాట్లాడుతూ....., డిజిటల్ వ్యవసాయం ప్రాధాన్యత పెరుగుతోందన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా రైతులకు సత్వర సమాచారం చేరవేయాలని సూచించారు. విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసిన రైతు విజ్ఞాన కేంద్రాలు తెలంగాణ వ్యవసాయ రంగంలో కొత్త




మార్పులకు దారితీస్తాయని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు, రైతులు పాల్గొని భవిష్యత్ వ్యవసాయ ప్రణాళికలపై చర్చించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం, సమగ్ర వ్యవసాయం, తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి వచ్చే పద్ధతుల అమలు, వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటలను ప్రోత్సహించడం వంటి అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. మెరుగైన వంగడాల అభివృద్ధి రైతుల ఆదాయాన్ని పెంచడంలో కీలకమని అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో 200కి పైగా శాస్త్రవేత్తలు, వ్యవసాయ విశ్వవిద్యాలయ సంచాలకులు, 12 జిల్లాల వ్యవసాయ అధికారులు, విస్తరణ శాస్త్రవేత్తలు, ఉద్యానవన శాఖ అధికారులు, ఎన్ ఏబీఏఆర్డి, భారత వ్యవసాయ పరిశోధన మండలి ప్రతినిధులు పాల్గొన్నారు. 2026-27 సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ ప్రణాళిక రూపకల్పనకు విలువైన సూచనలు, సలహాలు అందించారు. అంతేకాకుండా విశ్వవిద్యాలయ కార్యక్రమాలు రైతు స్థాయికి త్వరగా చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన రైతు విజ్ఞాన కేంద్రాల ద్వారా రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందించాల్సిన అవసరం ఎంతైన ఉందని వక్తలు సూచించారు. రైతుల శ్రేయస్సు కోసం చేపట్టిన కార్యక్రమాలు క్షేత్ర స్థాయికి వేగంగా చేరేలా సమన్వయం పెంచాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశం దక్షిణ తెలంగాణ వ్యవసాయ అభివృద్ధికి మార్గదర్శకంగా నిలిచేలా పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు.



# ఘనంగా తోటపల్లి సుబ్రహ్మణ్య శర్మ శత జయంతి వేడుక

ఉమ్మడి మహబూబ్ నగర్ ఏప్రిల్ 23 (మనం బ్యూరో); బిజినపల్లి మండలంలోని పాలెం గ్రామంలో తోటపల్లి సుబ్రమణ్యం మెమోరియల్ హైస్కూల్ (టీఎస్ఎం హెచ్ఎస్) లో గురువారం శ్రీ తోటపల్లి సుబ్రహ్మణ్యేశ్వర శర్మ జయంతి వేడుకలతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు డ్రాయింగ్ మాస్టర్ కే.గోపాలస్వామి 40 సంవత్సరాల పాటు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి పదవి విరమణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏయిడెడ్ స్కూల్ కావడంతో ఒకే పాఠశాలలో 40 ఏండ్ల పాటు ఈప్రాంత విద్యార్థులకు డ్రాయింగ్ లో నైపుణ్యం నేర్పించడంతో ఎంతో మంది ఆర్టిస్టులుగా, సివిల్ ఇంజనీయర్ చదువుల్లో ప్లానింగ్ డ్రాయింగ్ కు తోడ్పాటు అందించాయని కొనియాడారు. ఉపాధ్యాయుడిగానే కాకుండా ఆలయ అభివృద్ధిలో,పాలెం గ్రామాభివృద్ధిలో చురుకుగా ఉన్న గోపాలస్వామి భవిష్యతులో సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పూర్వ






విద్యార్థుల సంఘం నేతలు ఆయనను శాలువాలు మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. పాఠశాల విశ్రాంత ఉపాధ్యాయులు గాడి సురేందర్, కందాడై శ్రీనివాసచారి, మోహన్ బాబు, వెంకటేశ్వర్ రెడ్డి, జహిందర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, మధు దయానందరావు, ఈశ్వరమ్మ, సునీత, యశోద, శివలీల, ప్రకాష్ బాబుజి, కుటుంబ సభ్యులు కే.రాధ, మంజీరా కళ్యాణ్ కుమార్, సింధూర రాజశేఖర్, డాక్టర్ సుప్రియడాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ శ్రీ ప్రియ, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత చదువులకు ప్రాథమిక విద్య పునాది

**సర్పంచ్ చింత గాళ్ల శ్రీనివాసులు**
**బాలుర ప్రాథమికోన్నత పాఠశాలలో వార్షికోత్సవము**
**తల్లిదండ్రుల సమావేశంలో విద్యార్థుల ప్రగతి పత్రాల పంపిణీ**



ఉప్పునుంతల, ఏప్రిల్ 22 (మనం న్యూస్): పిల్లల భవిష్యత్తు బలంగా ఉండాలంటే ప్రాథమిక విద్య పటిష్టంగా ఉండాలని, చిన్ననాటి నుంచే మంచి అలవాట్లు, క్రమశిక్షణ అలవరచుకుంటేనే వారు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని ఉప్పునుంతల గ్రామ సర్పంచ్ చింత గాళ్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి, ఇష్టంతో చదువుకుంటే జీవితంలో ఉన్నత స్థానాలను సులభంగా సాధించవచ్చని ఆయన అన్నారు.

గురువారం ఉప్పునుంతలలోని స్థానిక ప్రాథమికోన్నత బాలుర పాఠశాలలో ఘనంగా నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమానికి సర్పంచ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల జీవితంలో ప్రాథమిక దశ అత్యంత కీలకమని, ఈ దశలో నేర్చుకున్న విలువలు, విజ్ఞానం భవిష్యత్తులో వారికి బలమైన పునాదిగా నిలుస్తాయని చెప్పారు.

విద్యార్థులు ప్రతిరోజూ క్రమబద్ధంగా చదువుతూ, ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా వినడం, పునశ్చరణ చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఇలా చేస్తే పరీక్షల సమయంలో భయం లేకుండా సులభంగా సమాధానాలు రాయగలుగుతారని వివరించారు. క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన వంటి లక్షణాలు విద్యార్థుల విజయానికి మార్గదర్శకాలని పేర్కొన్నారు.

అదేవిధంగా, నేటి కాలంలో సెల్ఫోన్ల వినియోగం విద్యార్థులపై ప్రతికూల ప్రభావం చూపుతోందని, అవసరమైనపుడు మాత్రమే వాటిని వినియోగించి మిగతా సమయాన్ని చదువు, ఆటలు, సృజనాత్మక కార్యక్రమాలకు కేటాయించాలని సూచించారు. శారీరక, మానసిక అభివృద్ధికి ఆటలు, క్రీడలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు.

విద్యార్థులు చదువుతో పాటు మంచి విలువలను అలవరచుకుని సమాజంలో ఆదర్శంగా నిలవాలని, తమ కుటుంబానికి, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి కృషి అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలలకు ఎంపికైన విద్యార్థులను సర్పంచ్ ప్రత్యేకంగా అభినందించి, వారికి జ్ఞాపికలు అందజేశారు. విద్యార్థుల విజయాలు గ్రామానికి గర్వకారణమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ, వారికి అవసరమైన సహకారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

## జాతీయ స్థాయి అండర్-17 క్రికెట్ టోర్నమెంట్కు సమన్వయ కమిటీల ఏర్పాటు

జడ్చర్ల, ఏప్రిల్ 23, (మనం న్యూస్): జడ్చర్లలో ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్న జాతీయ స్థాయి అండర్-17 బాలుర క్రికెట్ టోర్నమెంట్ను విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాటుచేసిన నిర్వహణ కమిటీల సమన్వయ సమావేశం ఈరోజు ఎంఆర్సీ సమావేశ మందిరంలో పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి శారదాబాయి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శారదాబాయి, రాష్ట్ర పీడీ మరియు పీ ఈ టి అసోసియేషన్ అధ్యక్షులు దుమర్ల నిరంజన్ మాట్లాడుతూ, టోర్నమెంట్ విజయానికి నిర్వహణ కమిటీల పాత్ర అత్యంత కీలకమని స్పష్టం చేశారు. కమిటీలలోని కన్వీనర్లు తమ సభ్యులతో సమన్వయం పాటిస్తూ, ఏవైనా సమస్యలు తలెత్తిన వెంటనే ఉన్నతాధికారులతో చర్చించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా రిజిస్ట్రేషన్, అకామిడేషన్, ఫుడ్, ట్రాన్స్పోర్ట్, గ్రౌండ్ కమిటీలు నిరంతరం అప్రమత్తంగా ఉండి క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఆరోగ్యశాఖ సిబ్బంది సేవలను వినియోగించుకోవడం ద్వారా క్రీడాకారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో టోర్నమెంట్ నిర్వాహకుడు మోయిన్, సీనియర్ పీడీలు గజానంద్, సోమ్లా, ఉమాదేవి, మీడియా ఇన్చార్జి కృష్ణయ్యతో పాటు వివిధ కమిటీల కన్వీనర్లు, సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలపై నేడు దిశ సమావేశం

**- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్....**

ఉమ్మడి మహబూబ్ నగర్ ఏప్రిల్ 23 (మనం బ్యూరో): నాగర్ కర్నూల్ జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించేందుకు జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం ఈనెల 24వ. తేదీ శుక్రవారం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. నాగర్ కర్నూల్ కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో ఉదయం 10:30 గంటలకు జరగనున్న ఈ సమావేశానికి నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి అధ్యక్షత వహించనున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలవుతున్న పలు అభివృద్ధి పథకాల పురోగతిపై సమావేశంలో సమగ్రంగా చర్చించనున్నారు. ముఖ్యంగా గ్రామీణ అభివృద్ధి, విద్య, ఆరోగ్యం, గృహ నిర్మాణం, ఉపాధి హామీ, సామాజిక భద్రత, బ్యాంకింగ్ రంగాలకు సంబంధించిన పథకాల అమలుపై సమీక్ష జరగనుంది.

అదేవిధంగా జిల్లాలో అమలవుతున్న పనుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై ఎంపీ, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి చర్చించనున్నారని కలెక్టర్ తెలిపారు. పథకాల అమలులో పారదర్శకత, సమన్వయం పెంపొందించేందుకు అవసరమైన చర్యలను సూచించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు హాజరుకానున్నారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు తమ శాఖలకు సంబంధించిన నివేదికలతో సకాలంలో సమావేశానికి హాజరు కావాలని కలెక్టర్ కోరారు.






## కల్వకుర్తి మున్సిపాలిటీ మహిళా కో-ఆప్షన్ పదవికి వాజిదా జహీర్ నామినేషన్...

**మున్సిపాలిటీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా...**
**కల్వకుర్తి మున్సిపాలిటీ కో ఆప్షన్ అభ్యర్థిని వాజిదా జహీర్.....**

కల్వకుర్తి ఏప్రిల్23(మనం న్యూస్): కల్వకుర్తి మున్సిపాలిటీలో మహిళా కో-ఆప్షన్ మహిళ పదవికి కల్వకుర్తి మున్సిపాలిటీకి చెందిన వాజిదా జహీర్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతుతో ఆమె తన అభ్యర్థిత్వ పత్రాలను మున్సిపాలిటీ కార్యాలయంలో సమర్పించారు.ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులతో కలిసి మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్న వాజిదా జహీర్ నామినేషన్ ప్రక్రియను పూర్తి చేశారు.ఈ సందర్భంగా కో ఆప్షన్ అభ్యర్థిని వాజిదా జహీర్ మాట్లాడుతూ మహిళల అభివృద్ధితో పాటు కల్వకుర్తి మున్సిపాలిటీ సమస్యల పరిష్కారం,ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు.కల్వకుర్తి మున్సిపాలిటీ కో ఆప్షన్ మహిళా అభ్యర్థినిగా నామినేషన్ దాఖలు చేసిన వాజీదా జహీర్ విజయం ఖాయమని కాంగ్రెస్ పార్టీ నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా జనగణన నిర్వహించాలి

**జిల్లా సెన్సెస్ అధికారి సుజాత**



ఉప్పునుంతల, ఏప్రిల్ 23 (మనం న్యూస్): మే 11వ తేదీ నుండి ప్రారంభమయ్యే జనగణన మొదటి విడత కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జిల్లా సెన్సెస్ అధికారి సుజాత ఆదేశించారు.గురువారం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె, జనగణన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చార్జ్ అధికారి అద్దంకి సునీత మాట్లాడుతూ మొదటి విడత శిక్షణ కార్యక్రమం విజయవంతంగా పూర్తయిందని తెలిపారు.

అనంతరం న్యూమరేటర్లకు సరఫరా చేయాల్సిన కిట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. శిక్షణ కాలంలో సూపర్వైజర్లు, న్యూమరేటర్లకు ట్రైనింగ్ యాప్ ద్వారా ప్రాక్టీస్ సెషన్లు నిర్వహించి, ఎలాంటి సందేహాలు లేకుండా పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని సూచించారు.

జనగణన కార్యక్రమం విజయవంతం కావాలంటే సమగ్ర ప్రణాళిక, సమన్వయం, క్షేత్రస్థాయిలో కచ్చితమైన అమలు అవసరమని ఆమె స్పష్టం చేశారు. స్వీయ గణనను ప్రోత్సహించే విధంగా అన్ని గ్రామాల్లో ప్రచార కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సెన్సెస్ అధికారి సుజాత జిల్లా సెన్సెస్ లైజన్ అధికారి శివరామకృష్ణ చార్జ్ ఆఫీసర్ ఛార్జ్ అద్దంకి సునీత తదితరులు పాల్గొన్నారు



# బాలానగర్లో హెచ్పీ పెట్రోల్ బంకుల్లో ఇంధన కొరత

బాలానగర్: ఏప్రిల్ 23 (మనం న్యూస్ ): మండల పరిధిలోని హెచ్పీ (ఏ్క) పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ సరఫరా నిలిచిపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత కొన్ని రోజులుగా ఇంధనం అందుబాటులో లేకపోవడంతో వాహనదారులు ఇతర ప్రాంతాలకు వెళ్లి ఇంధనం నింపించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రత్యేకంగా రైతులు, రవాణా వాహనదారులు, రోజువారీ ప్రయాణికులు ఈ సమస్య వల్ల తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని బంకుల్లో పూర్తిగా ఇంధనం ఖాళీ కావడంతో నో స్టాక్ బోర్డులు ఏర్పాటు చేశారు.

ఇంధన కొరతకు సరఫరా లోపం కారణమని స్థానికులు చెబుతుండగా, సమస్యను త్వరగా పరిష్కరించాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే సరఫరా పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇంధనం అందుబాటులోకి వచ్చే వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని వినియోగదారులు కోరుతున్నారు

# భగీరథ మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ



కొత్తకోట ,ఏప్రిల్ 23 (మనం న్యూస్): పట్టణ కేంద్రంలో గురువారం భగీరథ మహర్షి జయంతిని పురస్కరించుకుని సగర యువజన సంఘం అధ్యక్షులు ఎస్పీ సురేష్ సాగర్ అద్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తకోట భగీరథ చౌరస్తాలో ఏర్పాటు చేసిన భగీరథ మహర్షి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దివి నుండి భూమికి గంగానదిని తీసుకువచ్చిన మహనీయుడు భగీరథ మహర్షిని.. ఈ సందర్భంగా స్మరించుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు భగీరథ మహర్షి సేవలను కొనియాడుతూ ఆయన ఆచరణీయ జీవితాన్ని యువత అనుసరించాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో నరేంద్ర సాగర్, కురుమూర్తి , వినోద్ సాగర్, సి. కురుమూర్తి , శ్రీను సాగర్, భాస్కర్ , అరుణ్ , సి. నాగన్న , వినోద్ కుమార్, రాజు, బుచ్చన్న , జనార్దన్ , పెద్ద వెంకటయ్య, రవి సాగర్, రాజా బాబు, కృష్ణ సాగర్, రాములు , శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## స్వీయ గణన ప్రక్రియ సమర్ధవంతంగా

# జిల్లా యంత్రాంగం ప్రతిష్ట ఏర్పాట్లు

**– నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోషం**



ఉమ్మడి మహబూబ్ నగర్ ఏప్రిల్ 23 (మనం బ్యూరో): నాగర్ కర్నూల్ జిల్లాలో స్వీయ గణన ప్రక్రియను సమర్ధవంతంగా, పారదర్శకంగా, సమగ్రంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు.

ప్రజలు తమ కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం రూపొందించిన పోర్టల్ ద్వారా సేవలు అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఈ ప్రక్రియ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత వేగంగా, సులభంగా ప్రజలకు చేరవేయడం లక్ష్యంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయనితెలిపారు. సంబంధిత అధికారులు, స్థానిక సంస్థల ప్రతినిధులు ప్రజలకు అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తున్నారు. ప్రతి కుటుంబం తమ వివరాలను పూర్తిగా, ఖచ్చితంగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ విజ్ఞప్తి చేశారు. ఎటువంటి తప్పులు లేకుండా సమయానికి సమాచారం అందించడం ద్వారా స్వీయ గణన ప్రక్రియ విజయవంతం అవుతుందని తెలిపారు. ప్రజలకు ఏవైనా సందేహాలు ఉన్నచో సంబంధిత మండల కార్యాలయం, గ్రామపంచాయతీ కార్యదర్శి, మున్సిపల్ కార్యాలయం లేదా వార్డు కార్యదర్శిని సంప్రదించవచ్చని సూచించారు. స్వీయ గణన పోర్టల్ 26 ఏప్రిల్ 2026 నుండి 10 మే 2026 వరకు, మొత్తం 15 రోజుల పాటు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. ఇండ్ల జాబితా, గణనకు సంబంధించిన 34 ప్రశ్నల వివరాలు పోర్టల్లో పొందుపరచబడ్డాయి. ఇంటింటి గణన (ఫీల్ సర్వే) 2026 మే 11 నుండి జూన్ 9 వరకు నిర్వహించబడుతుందన్నారు.



# వేడి దృష్ట్యా జనగణన శిక్షణ వేళల్లో మార్పు

**– ఉత్తర్వులు జారీ**

ఉప్పునుంతల, ఏప్రిల్ 23 (మనం న్యూస్): జిల్లాలో నిర్వహిస్తున్న జనగణన శిక్షణ కార్యక్రమంలో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నాయి. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని శిక్షణ సమయాలను మార్చుతూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయాన్ని చార్జ్ ఆఫీసర్ అద్దంకి సునీత వెల్లడించారు.

ఇప్పటివరకు ఉదయం 9:30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతున్న శిక్షణను, ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తి మేరకు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించాలని నిర్ణయించారు. వేడి ప్రభావాన్ని తగ్గిస్తూ శిక్షణను సమర్థవంతంగా నిర్వహించడమే లక్ష్యంగా ఈ మార్పులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో జరుగుతున్న మొదటి విడత రెండవ స్పెల్ శిక్షణ షెడ్యూల్లో ఈ మార్పులు అమల్లోకి రానున్నాయి. శిక్షణకు హాజరయ్యే సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లు సమయానికి హాజరై, షెడ్యూల్ ప్రకారం సిలబస్ పూర్తి అయ్యేలా కృషి చేయాలని సూచించారు.ఇదిలా ఉండగా, ఈ నెల 18వ తేదీ నుండి ప్రారంభమైన జనగణన శిక్షణ కార్యక్రమం మొత్తం నాలుగు విడతలుగా మే 5వ తేదీ వరకు కొనసాగనుంది. ఇప్పటికే అన్ని మండలాల్లో మొదటి విడత శిక్షణ విజయవంతంగా పూర్తయ్యింది. రెండవ విడత శిక్షణ ఈనెల 23, 24, 25 తేదీల్లో కొనసాగుతోంది. మూడవ విడత ఈనెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించనుండగా, నాలుగో విడత మే 2వ తేదీ నుండి ప్రారంభమవుతుంది.ఈ నేపథ్యంలో ఆయా మండలాల చార్జ్ ఆఫీసర్లు శిక్షణ కార్యక్రమం సజావుగా జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అధికారులు శిక్షణలో పాల్గొనే వారందరూ క్రమశిక్షణతో వ్యవహరించి, బాధ్యతాయుతంగా శిక్షణను పూర్తిచేయాలని కోరారు.

జనగణన వంటి కీలక కార్యక్రమం విజయవంతం కావాలంటే శిక్షణ అత్యంత ముఖ్యమని, అందరూ చురుకుగా పాల్గొని ప్రభుత్వానికి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలో 10వ. తరగతి మూల్యాంకనం పూర్తి

**– నాగర్ కర్నూల్ జిల్లా డీఈఓ ఏ రమేష్ కుమార్....**



ఉమ్మడి మహబూబ్ నగర్ ఏప్రిల్ 23 (మనం బ్యూరో);: నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 10 వ. తరగతి జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని నాగర్ కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) ఏ. రమేష్ కుమార్ తెలిపారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూల్యాంకన కేంద్రంలో ఉపాధ్యాయులు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం సమాధాన పత్రాల పరిశీలనను సకాలంలో పూర్తి చేసినట్లు డిఇఓ వెల్లడించారు. మూల్యాంకన ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వానికి ప్రాధాన్యత ఇచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. డీఈఓ రమేష్ కుమార్ మాట్లాడుతూ..., ప్రతి సమాధాన పత్రాన్ని నిబంధనలకు అనుగుణంగా జాగ్రత్తగా పరిశీలించడంతో పాటు మార్కుల నమోదు ప్రక్రియను కూడా సమాంతరంగా నిర్వహించినట్లు తెలిపారు.

తద్వారా ఫలితాల తయారీకి అవసరమైన ప్రాథమిక పనులు వేగంగా పూర్తయ్యాయని చెప్పారు.

మే మొదటి వారంలో పదో తరగతి ఫలితాల విడుదలకు రాష్ట్ర స్థాయిలో ఏర్పాట్లు జరుగనున్నాయి. జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఈ మూల్యాంకన ప్రక్రియలో నాగర్ కర్నూల్ వనపర్తి జిల్లాల ఉపాధ్యాయులు పాల్గొని, నిర్దేశిత సమయానికి పని పూర్తి చేయడంలో కీలక పాత్ర పోషించారన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అత్యంత జాగ్రత్తగా మూల్యాంకనం నిర్వహించినట్లు డిఇఓ రమేష్ కుమార్ తెలిపారు.



# సేవ పేరిట దోపిడీనా? జడ్చర్ల మీసేవ కేంద్రాలపై ప్రజల ఆగ్రహ జ్వాలలు

**జడ్చర్ల నియోజక వర్గంలో మీసేవలపై నమ్మకం కూలుతుందా? నిబంధనలు ఎక్కడ దాక్కున్నాయి?**

మహబూబ్ నగర్ ఏప్రిల్ 23(మనం ప్రతినిధి): సేవ అనే పేరుతో సాగుతున్న వ్యవస్థే ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. మహబూబ్నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలో మీసేవ కేంద్రాల వ్యవహారం రోజురోజుకీ వివాదాస్పదంగా మారుతోంది. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని జరుగుతున్నదేమిటి నిజంగా సేవా? లేక వ్యవస్థీకృత దోపిడీనా? అనే ప్రశ్నలు గట్టిగా వినిపిస్తున్నాయి.

పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలోనే ఒకే ప్రాంతంలో ఐదు మీసేవ కేంద్రాలు వరుసగా వెలసడం తీవ్ర అనుమానాలకు దారితీస్తోంది. నిబంధనల ప్రకారం దూర పరిమితులు, అనుమతుల నియమాలు ఉన్నప్పటికీ అవన్నీ ఇక్కడ గాలిలో కలిసిపోయాయన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

ఎలా అనుమతులు వచ్చాయి? ఎవరు ఇచ్చారు? అసలు పర్యవేక్షణ ఉందా? అనే ప్రశ్నలకు అధికారికంగా స్పష్టత లేకపోవడం పరిస్థితిని మరింత వివాదాస్పదంగా మారుస్తోంది.

స్థానికుల ఆరోపణలు మరింత తీవ్రంగా ఉన్నాయి. కొన్ని కేంద్రాలు అధికారుల అండదండలతోనే ఇష్టారాజ్యంగా వెలిసాయని, లేకపోతే ఒకే ప్రాంతంలో ఇలా గుమికూడడం అసాధ్యమని వారు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. మరోవైపు, కొన్ని కేంద్రాల నిర్వాహకులు ఎక్కడైనా కేంద్రం పెట్టుకోవచ్చు అన్న ధోరణితో వ్యవహరిస్తున్నారన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

ఇక అత్యంత తీవ్రమైన ఆరోపణ ఏమిటంటే-సాధారణ సేవలకు కూడా అధిక రుసుములు వసూలు చేస్తున్నారని. ప్రభుత్వ సేవలు ప్రజలకు సులభంగా అందాల్సిన చోట, వాటినే ఆదాయ మార్గంగా మార్చుకున్నారన్న ఆవేదన ప్రజల్లో పెరుగుతోంది.

ఫిర్యాదు చేసినా వినేవారు లేరు స్పందించే వ్యవస్థే లేదు అని బాధితులు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలు కాగితాలకే పరిమితమయ్యాయా? లేక అమలే కావడం లేదా? అన్న అనుమానాలు మరింత బలపడుతున్నాయి.

ఇటీవల హైదరాబాద్లో మీసేవ కేంద్రాలపై ఏసీబీ దాడులు జరిగిన నేపథ్యంలో, జడ్చర్లలో కూడా సమగ్ర దర్యాప్తు జరగాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది. అక్రమాలు నిజమైతే వెంటనే చర్యలు తీసుకుని, నిబంధనలు ఉల్లంఘించిన కేంద్రాలను మూసివేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మొత్తానికి, జడ్చర్లలో మీసేవ కేంద్రాల వ్యవహారం ఇప్పుడు సేవ వ్యవస్థపైనే నమ్మకాన్ని కదిలించే స్థాయికి చేరింది. పర్యవేక్షణ లేకుండా కొనసాగుతున్న ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే, సేవ అనే పదమే ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోయే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది.

# జనరల్ ఫండ్ గ్రాంట్లపై సంచలన ఆరోపణలు

**- కోట్ల రూపాయల ఖర్చుపై పారదర్శకత లేకపోవడంపై తీవ్ర విమర్శలు**
**- నిధుల వినియోగం పై అనుమానాలు పెరుగుతున్నాయి**




మహబూబ్ నగర్ ఏప్రిల్ 23(మనం ప్రతినిధి)జడ్చర్ల మున్సిపాలిటీలో జనరల్ ఫండ్ గ్రాంట్ నిధుల వినియోగంపై తీవ్రస్థాయి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రారంభంలో చిన్న మొత్తాలుగా కనిపించిన ఖర్చులు క్రమంగా కోట్ల రూపాయలకు చేరుకున్నాయని, అయితే ఆ నిధులు ఎక్కడ, ఎలా ఖర్చయ్యాయన్నదానిపై స్పష్టమైన లెక్కలు లేకపోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

పట్టణంలోని చిన్న పనులు, కార్యక్రమాల పేరుతో కూడా భారీ మొత్తాలు బిల్లుల రూపంలో మంజూరు అవుతున్నాయని, ఇందులో పారదర్శకత పూర్తిగా లోపించిందని కొందరు కౌన్సిలర్లు-ప్రత్యేకించి మహిళా కౌన్సిలర్లు-తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. నిబంధనలను పక్కనపెట్టి ఇష్టారాజ్యంగా నిధులు విడుదల చేస్తున్నారన్న విమర్శలు కూడా బలంగా వినిపిస్తున్నాయి.

మున్సిపల్ కమిషనర్, చైర్పర్సన్ బాధ్యతలపై కూడా ప్రజల్లో ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రతి బిల్లు ఆమోద ప్రక్రియ ద్వారా వెళ్లాల్సి ఉండగా, కొన్ని సందర్భాల్లో నిబంధనలు పట్టించుకోకుండా నిధులు విడుదల అవుతున్నాయన్న అనుమానాలు ఉన్నాయి అని స్థానికులు చెబుతున్నారు.

మరోవైపు, ఒక రిటైర్డ్ కమిషనర్ వ్యాఖ్యల ప్రకారం, కమిషనర్ బదిలీ జరిగినా పాలకవర్గం తీసుకున్న నిర్ణయాలపై బాధ్యత తప్పదని చర్చ జరుగుతోంది.

ప్రతిపక్ష కౌన్సిలర్లు, స్థానిక ప్రజలు కూడా ఈ వ్యవహారంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చిన్న పని పేరుతో ప్రారంభమైన ఖర్చులు ఇప్పుడు కోట్ల రూపాయలకు చేరాయి. అసలు ఎంత ఖర్చయిందో, ఎక్కడ ఖర్చయిందో స్పష్టత లేదు అన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జనరల్ ఫండ్ గ్రాంట్ వినియోగంపై సమగ్ర ఆడిట్ నిర్వహించాలని, ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని నిజానిజాలు బయటపెట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ వెంటనే ప్రకటించాలి

**- డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగపూర్ మధు**




అచ్చంపేట ఏప్రిల్ 23(మనం న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా యూత్ డిక్లరేషన్ ప్రకటించి ఉద్యోగ నోటిఫికేషన్లు వెంటనే చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి నాగపూర్ మధు డిమాండ్ చేశారు గురువారం అచ్చంపేట పట్టణ కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించిన యూత్ డిక్లరేషన్ వెంటనే అమలు చేసి ఉద్యోగ నోటిఫికేషన్ వెయ్యాలని ఆయన డిమాండ్ చేశారు గత ప్రభుత్వం వేసిన నోటిఫికేషన్ లకు నియామక పత్రాలు మాత్రమే ఇచ్చి ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేతులు తెలుపుకుంటుందని ఆయన విమర్శించారు జాబ్ క్యాలెండర్ ప్రకటించి ప్రతి సంవత్సరం వివిధ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామని హామీనిచ్చి అమలు చేయకుండా నిరుద్యోగులను మోసం చేస్తుందని ఆయన అన్నారు ప్రభుత్వాలు మారిన నిరుద్యోగుల బతుకులు మాత్రం మారడం లేదని ఆయన అన్నారు సంవత్సరానికి రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కేవలం 60 వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చి ఇంకా లక్షా నలభై వేల ఉద్యోగాలు భర్తీ చేయకుండా కాలయాపన చేయడం సరికాదని ఆయన అన్నారు లక్షలాదిమంది నిరుద్యోగులు వేల రూపాయలు వెచ్చించి కోచింగ్ తీసుకుంటూ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తుంటే ప్రభుత్వం మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని ఆయన విమర్శించారు నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పసుపుల శివశంకర్ డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు వర్దం సైదులు పట్టణ కార్యదర్శి అమరేందర్ గౌడ్ పట్టణ అధ్యక్షులు మహేష్ నరేష్ రంజిత్ కళ్యాణ్ సాయి తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా గ్రామ బొడ్రాయి, పోచమ్మ అమ్మవారి ప్రథమ వార్షికోత్సవం

**- అచ్చంపేటలో ఆధ్యాత్మిక సందడి..**
**- పోచమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు**



అచ్చంపేట ఏప్రిల్ 23 (మనం న్యూస్): అచ్చంపేట పట్టణంలో ఆధ్యాత్మిక ఉత్సాహం వెల్లివిరిసింది. శ్రీ మహా త్రిపుర సుందరి స్వరూపమైన గ్రామ బొడ్రాయి (నాభిశిల) మరియు శ్రీ పోచమ్మ అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ తన సతీమణి డాక్టర్ చిక్కుడు అనురాధ తో కలిసి పాల్గొన్నారు. అమ్మవారి సన్నిధిలో ఏర్పాటు చేసిన యజ్ఞంలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు, నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దంపతులు, పట్టణ పుర ప్రముఖులు, సీనియర్ రాజకీయ నాయకులు, వివిధ శాఖల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకోవడంతో ఆలయ పరిసరాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి.=

# నీటి బకెట్లో పడి రెండేళ్ల చిన్నారి మృతి

**- అప్పటివరకు గంతులేసింది.. బోసినవ్వులతో ఇల్లంతా సందడి చేసింది.**



అచ్చంపేట ఏప్రిల్ 23 (మనం న్యూస్): అప్పటివరకు గంతులేసింది.. బోసినవ్వులతో ఇల్లంతా సందడి చేసింది. విధి వక్రీకరించిందెమో.. ఆడుకుంటూ అన్నం తిని చేతులు కడుక్కోవడానికి వెళ్లి నీటి బకెట్లో పడి రెండేళ్ల చిన్నారి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయింది. ఈ విషాద ఘటన నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని అప్పాయిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అప్పాయిపల్లి గ్రామంలో నివసించే చింతకుంట మల్లేష్, చింతకుంట విజయ, దంపతులకు మీనాక్షి(2) అనే కూతురు ఉంది. గురువారం మధ్యాహ్న సమయంలో తల్లి విజయ అంగన్వాడీ కేంద్రానికి వెళ్లగా.. ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు భోజనం చేస్తుండగా.. మీనాక్షి అన్నం తిని చేతి కడుక్కోవడానికి బాత్రూంలో ఉన్న బకెట్ వద్దకు వెళ్లి నీటిలో బోర్లాపడిపోయింది. కాసేపటి తర్వాత ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు పాప కోసం వెతుకుతుండగా బకెట్లో కనిపించింది. కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందింది. తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు.

# జేఈఈ మెయిన్స్‌లో సత్తా చాటిన విద్యార్థినీలు





వెల్దండ ఏప్రిల్ 23 (మనం న్యూస్): వెల్దండ మండల కేంద్రానికి చెందిన దాసరి రజిత, దాసరి లింగమయ్య ( అలియాస్ బద్రి) దంపతుల కూతురు దాసరి అఖిల, అదేవిధంగా మండల పరిధిలోని చొక్కన్న పల్లి గ్రామానికి చెందిన కొమ్ము యాదమ్మ నాగయ్య దంపతుల కూతురు హన్సిక, లు జేఈఈ మెయిన్స్ లో సత్తా చాటారు. ఉన్నతంగా పై చదువులకు ఎదగాలని గ్రామస్తులు విద్యార్థినీలను, విద్యార్థినిల తల్లిదండ్రులను అభినందనించారు. అభినందనించిన వారికి వారి తల్లిదండ్రులు ప్రత్యేకత ధన్యవాదాలు తెలిపారు.



# గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న...

**సర్పంచ్- రమేష్ నాయక్**

వెల్దండ ఏప్రిల్ 23 (మనం న్యూస్ )ప్రతి నిత్యం ప్రజల సమస్యల పరిష్కారానికి పాలకమండలి సభ్యులను మరియు ప్రజలందరిని కలుపుకుంటూ గ్రామ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న అని సర్పంచ్ రమేష్ నాయక్ తెలిపారు. రాజకీయాల్లోకి వచ్చినది అధికారానికి కాదు, ప్రజలకు సేవ చేయడానికే అని తన పనితో నిరూపిస్తున్నారు. ఊపిరి ఉన్నంత వరకు ప్రజల కోసమే పనిచేస్తానని నమ్మకంగా ముందుకు సాగుతున్నారు.

పలుగు తండా గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తూ, గ్రామంలో కరెంట్ సమష్య అనేదే లేకుండా చేసి ప్రజల సౌకర్యాన్ని పెంచడం కోసం నూతనంగా 25 కేవీ ట్రాన్స్ఫార్మర్ బుడ్డిని ప్రారంభించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనిత పంతు, వార్డ్ సభ్యులు వెంకటయ్య, భీమా, గోపాల్, శాంతి అంజ్య, సంతోష్, కార్యదర్శి వనజ, మరియు గ్రామ పెద్దలు ధర్మ నాయక్, శంకర్, రమేష్ నాయక్, జైపాల్,రత్త, దీప్ల, గోపాల్, రవీందర్ , మోత్య, పాండు, లైన్ మెన్ కృష్ణ రెడ్డి ,గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

# కబ్జా కోరల్లో దళితుల ఎల్లమ్మ..దేవాలయం!

**దళితుల ఆత్మగౌరవం పై జరుగుతున్న దాడి!!**
**నాగర్ కర్నూల్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజు మాదిగ.**





ఊరుకొండ ఏప్రిల్ 23 (మనం న్యూస్): స్థానిక మండల పరిధిలోని గురువారం మాదారం గ్రామంలో సర్వేనెంబర్ 628/2 ఒక ఎకరా భూమి ఇదే గ్రామానికి చెందిన మహమ్మద్ అబ్దుల్,ఖాదర్ మహమ్మద్ జహంగీర్,గత 35/40 సంవత్సరాల క్రితం రేణుక ఎల్లమ్మ దేవాలయ భూమి మాదారం గ్రామం మాదిగలు ఎర్ర బందిగయ్య,ఎర్రయ్య, దగ్గర దళితులు కొనుగోలు చేసుకుని ఉన్నారు.ఇదే గ్రామానికి చెందిన కోమటి శ్రీనివాస్ అనే వ్యక్తి తప్పుడు పత్రాలను సృష్టించి ఆక్రమించుకున్నాడని నాగర్కర్నూల్ జిల్లా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు గుడిగాని పల్లి రాజు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంలో వ్యాఖ్యానిస్తూ మాదిగలు కాయ కష్టం చేసుకుని కొన్న భూమిని,పట్టాదారులే మా భూమిని దళితులకు అమ్మినామని పోలీసుల ముందు ధ్రువీకరించిన, అకారణంగా 21 మంది దళితులపై స్థానిక ఎస్ఐ కృష్ణ దేవా కేసులు కట్టడం జరిగింది.భూస్వాముల భూములలో అకారణంగా ఆక్రమణకు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్న నెపంతోనే కక్షపూరితంగా వ్యవహరిస్తున్న ఊరుకొండ పోలీస్ అధికారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని,స్థానిక తహసిల్దార్,రెవెన్యూ డివిజనల్ అధికారి, గ్రామాన్ని సందర్శించి పరిష్కరించని పక్షంలో మా దళిత సంఘాల ఆధ్వర్యంలో పోరాటాలు చేసి మా దళితుల భూమిని కాపాడుకుంటామని తెలియజేయడం జరిగింది.దశాబ్దాలుగా అట్టడుగు వర్గాలు తమ ఆరాధ్య దైవంగా కొలుచుకునే ఎల్లమ్మ తల్లి సాక్షిగా నేడు అన్యాయం రాజ్యమేలుతుందని, పేదవాడి సొమ్మును పక్కవాడు ఆశించడం ఒక ఎత్తు అయితే,ఏకంగా దళితుల ఆత్మగౌరవ ప్రతిక అయిన దేవాలయ భూమి కబ్జా కోరల్లోకి లాగడం నాగరిక సమాజానికి సిగ్గుచేటు అని,ఇది కేవలం భూమి ఆక్రమణ కాదు, ఒక సామాజిక వర్గం యొక్క విశ్వాసంపై జరుగుతున్న తీవ్రమైన కుట్ర,భక్తికి కులం లేదు..కానీ భూమికి మాత్రం కులం ఉందా? అంటూ తీవ్ర స్థాయిలో దుమ్మెత్తి పోశారు. ఎక్కడైతే దళితులు ఐక్యంగా ఉండాలని భావిస్తారో,ఎక్కడైతే వారి ఆధ్యాత్మిక కేంద్రాలు అభివృద్ధి చెందుతాయో.. అక్కడ ఈ కబ్జా కోరలు అర్రులు చాచుతున్నాయి. రియల్ ఎస్టేట్ మాఫియా, రాజకీయ అండదండలు ఉన్న కొందరు స్వార్ధపరులు కళ్ళు మూసుకుపోయి అమ్మవారి భూములనే వేలానికి మింగేస్తున్నారని, నకిలీ పత్రాల సృష్టించడం రికార్డులను తారుమారు చేయడం వీరికి వెన్నతో పెట్టిన విద్య అని, పేదవాడు ఏడుస్తుంటే దశాబ్దాలుగా చరిత్ర ఉన్న దేవాలయ ప్రాంగణం ఇనుప కంచల మధ్య బందీ అవుతుంటే,మన వ్యవస్థ ఇంకా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని, దళితుల ఆగ్రహానికి గురికాక తప్పదని పునరుద్ఘటించారు. అమ్మా ఎల్లమ్మ..నీ గడ్డమీద నీ బిడ్డల్లకి చోటు లేకుండా చేస్తున్న ఈ రాబందుల వేట ఇంకెన్నాళ్లు? ఇది కేవలం ప్రార్థన చేయాల్సిన సమయం కాదు ప్రతిఘటించాల్సిన సమయం.దళితుల భూమి అంటే ధారాదత్తం చేసిన దానం కాదు,అది వారి హక్కు.ఆ హక్కును కాల రాస్తే చూస్తూ ఊరుకునే రోజులు ముగింపు పలకాలని కోరారు.దేవాలయ భూమిని కబ్జా చేయడం అంటే దైవ ద్రోహం మాత్రమే కాదు,అది రాజ్యాంగ విరుద్ధం.ఇప్పటికైనా ప్రభుత్వం,సంబంధిత శాఖలు స్పందించి ఆక్రమణలను తొలగించాలని,ఎల్లమ్మ గుడి ప్రాంగణం మళ్లీ భక్తుల జయ జయ ధ్వనులతో ప్రతిధ్వనించాలని, ఆక్రమణదారుల కళ్ళు తెరిపించేలా,బాధితులకు న్యాయం జరిగేలా పోరాటం సాగాలని,'మాభూమి మాకే మా దైవం మాకే' అనే నినాదంతో గ్రామస్తుల సహకారంతో సాధించేవరకు దళితుల పోరాటం ఆగదని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అంకురి కృష్ణయ్య,అంకూరి పకీరు, హుస్సేన్,అంకూరి బందిగయ్య,ఏడవ వార్డ్ సభ్యురాలు అంకూరి, బాలమణి,అంకూరి రాము,తదితరులు పాల్గొన్నారు.

# రైతులపై అధికారుల బెదిరింపులు





కొల్లాపూర్ ఏప్రిల్ 23 (మనం న్యూస్): కొల్లాపూర్ నియోజక వర్గంలోని కోడేరు మండలం, ఎర్రనబాయి తండా గ్రామపంచాయతీ పరిధిలో గల మూలమడత తండా కి చెందిన కేతావత్ సూర్య తండ్రి కేతావత్ శక్రు కు చెందిన సర్వేనెంబర్ 37 లో గల భూమిని అక్రమంగా అధికారుల బెదిరింపు లతో లాక్కోవాలని చూస్తున్నారని గురువారం స్థానిక విలేకరులకు బాధితులు కేతావత్ సూర్య ఆయన తండ్రి శక్రు తెలుపుకున్నారు. న్యాయం చేయాల్సిన అధికారులే మరియు కోర్టు ఆర్డర్ ను ధిక్కరించి అన్యాయాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని ఉన్నత అధికారులను కోరారు.

# ఇందిరమ్మ ఇండ్లు కావాలని ఎమ్మెల్యేను వినతి

**- జూపల్లి రాములు యాదవ్**



చారకొండ,ఏప్రిల్23(మనం న్యూస్):జూపల్లి గ్రామానికి 50 ఇందిరమ్మ ఇండ్లకు నివేదికను ఇప్పించాలని గురువారం కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డినీ సత్య హరిచంద్ర ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జూపల్లి రాములు యాదవ్ వినతి పత్రంతోపాటు కోరారు.ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించడంతో రాములు యాదవ్ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఉన్నత భవిష్యత్తుకు ప్రాథమిక విద్యే బలమైన పునాది: సర్పంచ్ బంగారయ్య

**ఉన్నత చదువులకు ప్రాథమిక విద్యే పునాది**
**సర్పంచ్ గా. బంగారయ్య**





ఉమ్మడి గోపాలపేట, ఏప్రిల్ 22 (మనం న్యూస్): పిల్లల భవిష్యత్తు బలంగా ఉండాలంటే ప్రాథమిక విద్య పటిష్టంగా ఉండాలని, చిన్ననాటి నుంచే మంచి అలవాట్లు, క్రమశిక్షణ అలవరచుకుంటేనే వారు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని లక్ష్మీదేవిపల్లి గ్రామ సర్పంచ్ గా. బంగారయ్య అన్నారు. విద్యార్థులు కష్టపడి, ఇష్టపడి చదివితే జీవితంలో ఉన్నత స్థానాలను సులభంగా చేరుకోవచ్చని పేర్కొన్నారు.

ఉప్పునుంతలలోని ప్రాథమికోన్నత బాలుర పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల జీవితంలో ప్రాథమిక దశ అత్యంత కీలకమని, ఈ దశలో నేర్చుకున్న విజ్ఞానం, విలువలు భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలుస్తాయని తెలిపారు.

విద్యార్థులు ప్రతిరోజూ క్రమబద్ధంగా చదువుతూ, ఉపాధ్యాయులు బోధించే పాఠాలను శ్రద్ధగా వినాలని, పునశ్చరణ అలవాటు చేసుకోవాలని సూచించారు. అలా చేస్తే పరీక్షల సమయంలో భయం లేకుండా సమాధానాలు రాయగలరని చెప్పారు. క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన వంటి లక్షణాలు విజయానికి మార్గదర్శకాలని వివరించారు.

నేటి కాలంలో సెల్‌ఫోన్ల వినియోగం విద్యార్థులపై ప్రతికూల ప్రభావం చూపుతోందని, అవసరమైన సందర్భాల్లో మాత్రమే వాటిని వినియోగించాలని సూచించారు. మిగతా సమయాన్ని చదువు, ఆటలు, సృజనాత్మక కార్యక్రమాలకు కేటాయించాలని అన్నారు. శారీరక, మానసిక అభివృద్ధికి క్రీడలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు.

చదువుతో పాటు మంచి విలువలను అలవరచుకుని సమాజంలో ఆదర్శంగా నిలవాలని, కుటుంబానికి, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. విద్యార్థుల విజయాలు గ్రామానికి గర్వకారణమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఆవుల షెడ్డు మంటల్లో దగ్ధం రైతుకు భారీ నష్టం



వెల్దండ ఏప్రిల్ 23 (మనం న్యూస్ ): వెల్దండ మండల పరిధిలోని రాచూర్ గ్రామానికి చెందిన దుబ్బ సుగుణమ్మకు సంబంధించిన ఆవుల షెడ్డు బుధవారం రాత్రి దగ్ధం కావడంతో 40 స్ప్రింక్లర్ పైపులు, నల్లాలతో పాటుగా వ్యవసాయ పనిముట్లు కాలి బూడిద కావడం జరిగింది. ఈ మంటల్లో అందాజ 2లక్షల వరకు ఆస్తినష్టం వాటిలిందంటూ రైతు సుగుణమ్మ బోరున విలపించారు. ఈ ఘటనపై దయచేసి అధికారులు, నాయకులు, స్పందించి న్యాయం చేయాలనీ రైతు సుగుణమ్మ కోరారు.

# రేవల్లి ప్రభుత్వ ఆసుపత్రిపై సర్పంచ్ రాజయ్య అకస్మిక తనిఖీ

**రేవల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో సర్పంచ్ అకస్మిక తనిఖీ**
**స్టాఫ్ నర్స్ గైర్హాజరు పై వివరాలు కోరిన సర్పంచ్**



రేవల్లి, ఏప్రిల్ 23 (మనం న్యూస్): రేవల్లి గ్రామ ప్రభుత్వ ఆసుపత్రిని గ్రామ సర్పంచ్ టప్ప రాజయ్య బుధవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆయన పరిశీలించారు.

తనిఖీల సందర్భంగా స్టాఫ్ నర్స్ విధుల్లో అందుబాటులో లేకపోవడాన్ని గమనించిన సర్పంచ్, దీనిపై ఆసుపత్రి వైద్యాధికారిని వివరణ కోరారు. దీనికి స్పందించిన వైద్యాధికారి, స్టాఫ్ నర్స్ గైర్హాజరు విషయంపై తనకు కూడా పూర్తి సమాచారం అందలేదని తెలిపారు. ఆసుపత్రిలో సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించకుండా సమయపాలన పాటించాలని, ప్రజలకు నిరంతర వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ సూచించారు. గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ఆసుపత్రుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ఆసుపత్రి సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# బ్రతుకు జీవుడా భద్రం.. భళారా చిత్రం..!

**ద్విచక్ర వాహనంపై**
**తిరుగుతూ మంచాలను**
**విక్రయిస్తున్న సాగర్**




బాలానగర్ : ఏప్రిల్ 23( మనం న్యూస్): ఓ బ్రతుకు జీవుడు తన ప్రాణాలను పణంగా పెట్టి ద్విచక్ర వాహనంపై మంచాలను తీసుకెళ్తూ పొట్టకూటి కోసం పాటుపడుతున్నట్లు మంచాలను విక్రయించే ఓ విక్రయదారుడి చిత్రమిది. మండుటెండను సైతం లెక్కచేయకుండా మంచాలను విక్రయించేందుకు బాలనగర్ మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని వివిధ గ్రామాలలో రాజపూర్ మండలంలో కూడా ఊరు వాడ తిరుగుతూ విక్రయిస్తున్నట్లు మంచాల విక్రయదారుడు సాగర్ తెలిపారు. గురువారం ఈమెరకు బాల్నగర్ మండల కేంద్రంలోని పెదయ్యపల్లి చౌరస్తాలో దర్శనమిచ్చాడు. పలు గ్రామాలు తండాలు తిరిగినప్పటికీ ఈరోజు ఒక్కటి కూడా సేల్ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో రోజు ఒక్క విధంగా తమకు గిరాకీ ఉంటుందని తెలిపారు. హెల్మెట్, క్యాప్ లాంటిది ఉపయోగించకుండానే ఎండలో వ్యాపారం చేయడం ఇబ్బందికరంగా ఉండదా అని ప్రశ్నించగా.. అలవాటుగా మారిపోయిందని అమాయకంగా సమాధానం ఇచ్చాడు.

# ఎక్సైజ్ అధికారుల దాడుల్లో పట్టుబడ్డ నాటుసార విక్రయిస్తున్న వ్యక్తి

**- 8 లీటర్ల నాటు సారా స్వాధీనం**



అచ్చంపేట ఏప్రిల్ 23 (మనం న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నాటు సారా నిర్మూలనలో భాగంగా అచ్చంపేట ఎక్సైజ్ కృష్ణయ్య ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం ఎక్సైజ్ ఎస్ఐ సతీష్ కుమార్ మరియు సిబ్బంది ఆధ్వర్యంలో అమ్రాబాద్ మండలం కొత్తపల్లి తండా పొలిమేరలో పలు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక బైక్ దానిమీద ఎనిమిది లీటర్ల నాటు సారా తరలిస్తున్న దానిని స్వాధీనం చేసుకున్నారు అదేవిధంగా చేయడం జరిగింది.

# కార్మికుల నిరవధిక సమ్మె సందర్భంగా ఆర్టీసీ కార్మికుల ర్యాలీ









**- పోలీసు భద్రత నడుమ ప్రైవేటు బస్సులు పునరుద్ధరణ**
**- ఆర్టీసీ కార్మికుల పరిష్కరించాలి అని డిమాండ్**

అచ్చంపేట ఏప్రిల్ 23 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల సమ్మె రెండో రోజుకు చేరుకున్న నేపథ్యంలో అచ్చంపేటలో ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టారు. అచ్చంపేట ఆర్టీసీ డిపో మేనేజర్ పి.ఎం.డి ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం నాలుగు గంటల నుంచే అద్దె బస్సులను రంగంలోకి దింపడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నరు

అచ్చంపేట డిపోలో మొత్తం 58 ప్రభుత్వ బస్సులు, 27 అద్దె బస్సులు ఉన్నప్పటికీ, సమ్మె కారణంగా గురువారం ఒక్క ప్రభుత్వ బస్సు మాత్రమే నడిపించారు. అయితే 27 అద్దె బస్సులను నాగర్ కర్నూల్, మహబూబ్నగర్, హైదరాబాద్, మద్దిమడుగు మార్గాల్లో నడిపిస్తూ రవాణా సౌకర్యాన్ని కొనసాగించారు. కాగా అద్దె బస్సులతో ప్రజా రవాణాను పునరుద్ధరించినట్లు తెలియని ప్రయాణికులు తమ ప్రయాణాలను వాయిదా వేసుకున్నట్లు తెలుస్తోంది

ప్రజా రవాణా రోజువారి కంటే సుమారు 62 శాతం మేర తగ్గినా, గురువారం ఒక్కరోజే 5 నుండి 6 వేల వరకు ప్రయాణికులు ఆర్టీసీ బస్సులను వినియోగించారు. అద్దె బస్సులు అందుబాటులోకి రావడంతో ప్రజలు కొంతవరకు ఉపశమనం పొందారు. ఇదిలా ఉండగా, అచ్చంపేట డీఎస్పీ పల్లె శ్రీనివాస్ ముందస్తుగా హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో కార్మికులు ఎలాంటి ఉద్రిక్తతలకు దారి తీయకుండా శాంతియుతంగా నిరసన తెలిపారు. బుధవారం రాత్రి తమ నిరసన దీక్ష టెంట్లను తొలగించడమే కాక గురువారం తలపెట్టిన వంట వార్పు కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ డిపో నుండి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు.

### హామీల అమలుపై కార్మికుల డిమాండ్

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తూ, తమ నిరసనను ప్రశాంతంగా కొనసాగిస్తున్నారు.

## ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే తెలంగాణ ప్రభుత్వం స్పందించాలి

**- ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ ఆత్మహత్యాయత్నం బాధాకరం**
**- శ్రీనివాస్ తెలంగాణ ఉద్యమకారుడు**




అచ్చంపేట ఏప్రిల్ 23(మనం న్యూస్): ఆర్టీసీ కార్మికుడు నర్సంపేట బస్టాండ్ లో ఆత్మహత్యాయత్నం చేసుకోవడం చాలా బాధాకరం అనే తెలంగాణ ఉద్యమకారుడు శ్రీనివాస్ పేర్కొన్నారు సంవత్సరాల తరబడి వారి సమస్యల పరిష్కారానికి వారు పోరాటం చేయడం జరుగుతుంది. గత ప్రభుత్వాల తప్పిదాల వల్ల ఈ ప్రభుత్వంలోనైనా మాకు న్యాయం జరుగుతుందని నమ్మకంతో వారు జీవనం సాగిస్తున్నారు ఇటువంటి సందర్భంలో మానసికంగా కృంగిపోయిన శంకర్ గౌడ్ ఆత్మహత్యాయత్నం చేసుకోవడం బాధాకరం ప్రభుత్వం వెంటనే స్పందించి ఆర్టీసీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిశీలించి వారి యొక్క న్యాయపరమైన డిమాండ్ ను అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల పక్షాన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

## లక్ష్మీదేవిపల్లిలో ఘనంగా భగీరథ మహర్షి జయంతి వేడుకలు

ఉమ్మడి గోపాలపేట, ఏప్రిల్ 23 (మనం న్యూస్): లక్ష్మీదేవిపల్లి గ్రామంలో భగీరథ మహర్షి జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను, సమాజానికి అందించిన స్ఫూర్తిదాయక సందేశాలను స్మరించుకున్నారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గా. బంగారయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భగీరథ మహర్షి చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శమని, సమాజ అభ్యున్నతికి ఆయన ఆలోచనలు మార్గదర్శకాలని పేర్కొన్నారు. యువత మహర్షి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు అయోధ్య రాములు, గ్రామ పెద్దలు, యువకులు, ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమం భక్తి, ఉత్సాహ వాతావరణంలో జరిగింది.



## బాలనగర్లో అంబరాన్నంటిన అభిమన్యు రెడ్డి జన్మదిన సంబరాలు

**బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలు**
**క్రేన్ సహాయంతో భారీ గజమాలతో సత్కారం**



బాలానగర్ : ఏప్రిల్ 23( మనం న్యూస్) : జడ్చర్ల బీఆర్ఎస్ పార్టీ యువ నేత చించోడు అభిమన్యు రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం బాలానగర్ మండల కేంద్రంలోని పెద్దయపల్లి చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ మండల నాయకుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ క్రేన్ సహాయంతో భారీ గజమాలను అభిమన్య రెడ్డికి వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అలాగే కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి పూల మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా అభిమన్యు రెడ్డి రాజకీయంగా ఎదుగుదలకు ప్రజలు సహకరిస్తున్నారని పేర్కొన్నారు యువకులు నూతన ఉత్సాహంతో బ్యానర్లు ఏర్పాటు చేసి అభిమన్యు రెడ్డి పట్ల అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డి, సీనియర్ నాయకులు వెంకటాచారి, లింగు నాయక్, గోపాల్ రెడ్డి, బాలు నాయక్, జగన్ నాయక్, గోపి నాయక్, సుప్ప ప్రకాష్, వెంకట్ నాయక్, మంజు నాయక్, అభిమన్యు రెడ్డి అభిమానులు, యువకులు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## మిడ్జిల్ తహసిల్దార్‌గా రాఘవేందర్ రెడ్డి నియామకం

మిడ్జిల్ ఏప్రిల్ 23 ( మనం న్యూస్) మిడ్చిల్ మండల నూతన తహసిల్దార్ గా రాఘవేందర్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు తహసిల్దార్ గా విధులు నిర్వహించిన పులి రాజు పదోన్నతి పై బదిలీ అయ్యారు ఆయన స్థానంలో ఎఫ్ఎసిగా స్వప్న తహసీల్దారుగా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న స్థానాన్ని రాఘవేందర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.